# కంప్యూటర్ - మానవ మేధస్సు

- సుశ్రీ.

ఈ రోజులలో కంప్యూటర్ గురించి, దాని ఉపయోగములు (ఆటలు ఆడుకోడానికి, దృశ్య, శ్రవణ కార్యక్రమములు తిలకించడానికి, ప్రపంచములో ఏమూల ఏమవుతున్నదో (వార్తలు) తెలుసుకోడానికి, ప్రపంచములో చాలా రకములైన జాతులగురించి, తెగలగురించి, అనేక రకములైన జీవరాశులగురించి, ప్రసిద్ధి పొందిన ఎన్నో గ్రంధములను గురించి, ఎంతోమంది కళాకారులను గురించి, ఆధ్యాత్మిక భోదనలు చేసే గురువుల ఉపన్యాసములు - ఇలా ఇది అది అని తారతమ్యములేక విజ్ఞాన సర్వస్వమూ అంటే ఇక్కడే దొరుకుతుందేమో! అన్నట్లు) తెలియనివారు లేరంటే అతిశయోక్తి ఏమాత్రమూకాదు. ఇలాంటి కంప్యూటర్ గొప్పతనమును మెచ్చుకొనే వ్యక్తి, తన మేధాసంపత్తిని గుర్తించలేకపోవడం ఆలోచించవలసిన విషయము. ఈ క్రిందనీయబడిన పోలికలను, విశ్లేషణను చదివి మీరేమిటో, మీ సామర్ధ్యము ఏమిటో మీకుమీరే తెలుసుకోండి!

*"హల్లో సతీష్‌గారూ! ఎలా ఉన్నారు?"*

*"ప్రసాద్‌గారా! నేను బాగానే ఉన్నాను. మీరెలాగ ఉన్నారు?"*

*"బాగానే ఉన్నానండి. నిన్న లైబ్రరీలో జరిగిన ఉపన్యాసమునకు రాలేదేమిటండి?"*

*"అయ్యయ్యో! మరిచే పోయాను సుమండీ! వయసు మీద పడుతోంది కదండి. గుర్తుండి చావడం లేదు."*

ఇలాంటి సంభాషణలని మనము తరుచూ వింటూ వింటాము. కాస్తంత ఆలోచిస్తే, మరచి పోయామనేది సాకు మాత్రమేనని గుర్తించడానికి ఆట్టే సమయం పట్టదు. అదే ఒక పార్టీనో, సినిమానో అయితే మరచిపోయే ప్రసక్తే ఉండదు. ఇక్కడ మనకి ఆ పని చెయ్యడం ఇష్టమా? లేదా? అనేది ప్రధానం. క్రింద మీరు చదవబోతున్న విషయములు (i) ఆసక్తితో చదువుతారా? (ii) అప్రస్తుతమనుకుని ఇక్కడితో ఆపివేస్తున్నారా? అది కూడా మీ చేతిలోనే ఉంది.

మనము ఈ సృష్టిలో ఎంతో అదృష్టవంతులము. సృష్టికర్త ఎంతగొప్పవాడు? ఒకవ్యక్తికి, మరొకవ్యక్తికి ఎంతతేడా? ఒక కర్మాగారములో తయారయ్యే వస్తువులన్నీ ఒకేరకముగా ఉంటాయి. కాని సృష్టి కర్త మాత్రమూ ఒక్కొక్కవ్యక్తికి ఒక్కొక్కరూపము, ఒక్కొక్క రకమైన కళని, ఒక్కొక్క వ్యక్తిత్వాన్ని ఇచ్చాడు. దీనికి ఎంత నైపుణ్యము కావాలో కదా! మనము ఈరోజు చూస్తున్నాం! 5 మెగా పిక్సల్స్ కెమెరాతో, 1 గిగాబైట్ మెమొరీతో, రిజల్యూషన్‌ను బట్టి దాదాపు 200 నుండి 400 పిక్చర్స్ తీసుకోవచ్చు. మనము రోజూ చూసే ఎన్నో దృశ్యములు హై రిజల్యూషన్‌తో మన మెదడులో ముద్రించబడి ఉంటున్నాయి. కొన్ని సందర్భములలో మనము ఒక సన్నివేశాన్ని చిత్రీకరించామనే విషయమే మనకు తెలియదు. కలలరూపములో గాని, మళ్ళీ అలాంటి దృశ్యమే చూసినపుడు - ఇది ఇంతకు ముందు చూసామనే విషయము అవగతమౌతుంది. మన కంప్యూటర్‌లో ఎంత సమాచారమును పొందుపరచవచ్చునో, దానికి కొన్ని రెట్లు సమాచారము మన మెదడులో నిక్షిప్తమౌతున్నది. కాని మనకు చాలా విషయములు నిక్షిప్తమైన విషయము తెలియదు. ఎన్నో సన్నివేశములు వీడియోలరూపములో పొందుపరుస్తున్న మనం, మన మస్తిష్కములో రూపొందించుకుంటున్న సన్నివేశములను గుర్తించడమేలేదు. కంప్యూటర్‌కి, మానవమేధస్సుకు ఎంతో సారూప్యత ఉంది. మానవుడు తయారుచేసిన కంప్యూటర్ కంటే మానవమేధస్సు చాలా గొప్పది (సక్రమముగా ఉపయోగించుకుంటే). ఆ విశేషములను క్రింద విశదీకరిద్దాం!

కంప్యూటర్‌లో సి.పి.యు, మెమొరీ, హార్డ్‌డిస్క్, తెర ప్రధానముగా ఉంటాయి. మనకు మెదడులోనే ఇవి అన్నీ అమర్చబడి ఉన్నాయి. ఒక వస్తువును చూడగానే అది ఏమిటనే జ్ఞానాన్ని మన మెదడు ఇస్తుంది. అది మన మెమొరీలో అవసరమైనంతవరకు ఉంటుంది. తరువాత అది హార్డ్ డిస్క్‌లో పొందుపరచబడుతుంది. చూసిన వస్తువు ప్రతిబింభము మనకు రెటీనాపై పడి వస్తుజ్ఞానము కలుగుతున్నది.

కంప్యూటర్‌కి ప్రింటరు, స్కేనరు, వెబ్ కెమెరా (ఇప్పుడు బిల్ట్‌ఇన్‌గా వస్తోందనుకోండి) వంటి పరికరములు విడిగా అమర్చబడతాయి. మనకి అన్నీ బిల్ట్‌ఇన్ అయ్యి ఉన్నాయి. అదీ చాలా పొదుపుగా, అతి తక్కువ స్థలములో. ఏదైనా ఇష్టమైన వస్తువును చూసినపుడు అది వెంటనే మన మెమొరీలో స్థానం సంపాదించుకుంటుంది. చూసినది చూసినట్లుగా చిత్రీకరించగలిగితే అది ప్రింటర్ చేసే పనే కదా! ఒక వ్యక్తితో మనము మాట్లాడుతుంటే అది వెబ్‌కేమ్ చేసే పనేకదా! ఇంకా మనము ఎప్పుడు లేవాలి? ఏమి తినాలి? ఏమి పని చెయ్యాలి? వంటివి అన్నీ మన మెదడు ఇచ్చే సూచనల మేరకు జరుగుతాయి. ఇది మన కంప్యూటర్‌లోని ఆపరేటింగ్ సిస్టమ్ పని వంటిదే కదా! ఇక అసంకల్పిత ప్రతీకారచర్య అనేదొకటి ఉంది. మనము కనులు ఆర్పకుండా టీ.వీ చూస్తున్నామనుకోండి, అకస్మాత్తుగా ఒక దోమ మన కంటివద్దకు వచ్చింది. వెంటనే కనురెప్పలు మూసుకుంటాయి. లేదా పిల్లలకి అన్నము తినిపిస్తుంటే, అప్రయత్నముగానే మన నోరు విప్పుతాము. కంప్యూటర్‌లోని చాలాకాలముగా వాడని ఒక ఫైలు తెరవాలంటే (ఫెచ్ చెయ్యడం) కొంతసమయము పడుతుంది. అదే మనము 30 సంవత్సరముల క్రితం జరిగిన సంఘటన కూడా పూసగుచ్చినట్లు చెప్పగలం. కంప్యూటర్‌లో హార్డ్‌డిస్క్ కెపాసిటికి ఒక పరిమితి ఉంది. పెంచుకోవాలంటే క్రొత్త హార్డ్ డిస్క్ కొనుక్కోవలసిందే. కాని మన మెదడులో సెల్ఫ్ ఎక్స్‌పేండబుల్ డిస్క్ ఉంది. విజ్ఞానము పెంచుకున్నవారికి పెంచుకున్నంత అవకాశముంది. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో, ఎన్నెన్నో పోలికలు.

ఇక మనకందరకు తెలిసిన విషయము కంప్యూటర్‌లో ఫీడ్ చేసిన విషయము పదిలమని. మన విషయములో కూడా అది వాస్తవం. మనకు అవసరమైనది, అనవసరమైనది అనే నిర్ణయం తీసుకోవడంలో సరియైన అనుభవంలేదు. కాబట్టి చెడును, కలిగిన కష్టాన్ని అందుబాటులో ఉంచుకొని; జరిగిన మంచిని, సుఖాలని లోపలి పొరలలో ఎక్కడో దాచుకుంటాం. ఎవ్వరైనా వ్యక్తి తారసపడినపుడు మొదట మనము ప్రస్తావించేది మనకు కలిగిన కష్టముగురించే; సుఖాన్నిచ్చే సంఘటనలు ఎన్ని జరిగినా అవి తరువాతే ప్రస్తావనకి వస్తాయి. మనము ఒకరోజులో పోగుచేసే ఫొటోలు, వీడియోలు, విషయములు ఒక కంప్యూటర్‌లోనికి ఫీడ్ చేస్తే ఎంత హార్డ్‌డిస్క్ కావాలో, ఎంత సమయము పడుతుందో ఒక్కసారి ఆలోచించండి. అప్రయత్నముగానే ఎంతో సమాచారాన్ని మన హార్డ్‌డిస్క్‌లో మనము ఫీడ్ చేస్తున్నాము. ఇలా ఎన్నో సంవత్సరాలలో పోగుచేసే సమాచారమును ఫీడ్ చెయ్యడానికి కావలసిన హార్డ్ డిస్క్ కొలతలను ఊహించుకోండి. ఒక కంప్యూటర్ ఉత్పత్తిచేసే వేడి ఎంతో మనకి తెలుసు. కాని మన కంప్యూటర్ అంతవేడిని ఉత్పత్తి చెయ్యడంలేదు. కంప్యూటర్‌లో ఉన్నట్లు చల్లబరచడానికి పంకా కూడా మన శరీరములో లేదు.

ఒక ప్రముఖుడు అన్నట్లు 'ఈ శరీరానికి వేరే పనేమీలేదు. ఈ మెదడును ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకొని వెళ్ళడానికే'. ఇది విన్న తరువాత - ఇంత తక్కువ కాలములో, ఇంత తక్కువ ప్రదేశములో ఎన్నో అవయవములను పొందికగా అమర్చి, ఇంత ఉత్పాదకతను ఇచ్చే మనిషిని సృజించిన సృష్టికర్త ఎంత చతురుడో మీరే ఆలోచించుకోండి.

*మీకు ఈ విషయములు నచ్చి ఉంటాయని ఆశిస్తాము. మళ్ళీ వచ్చే సంచికలో కలుద్దాం!*